
ద్వారకాతిరుమలలో గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లు


అనంతపల్లిలో మదన గోపాలస్వామి వారి గ్రామోత్సవం


కొవ్వూరు వరద గోపాలస్వామి గుడిలో ఉత్తర ద్వార దర్శనం


వేగేశ్వరపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి

నేత్ర పర్వం.. ఉత్తర ద్వార దర్శనం

- ద్వారకాతిరుమలలో శ్రీవారిని దర్శించిన వేలాది భక్తులు
- వైష్ణవ ఆలయాల్లో భక్తుల రద్దీ
- ఘనంగా వైకుంఠ ఏకాదశి

ద్వారకాతిరుమల: వైకుంఠ ఏకాదశి కావడంతో సోమవారం వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక చిన వెంకన్న దివ్య క్షేత్రమైతే ఇల వైకుంఠాన్ని తలపించింది. వేకువనే ఉభయ దేవేరులతో శ్రీవారు ఉత్తర ద్వారం వద్ద వెండి గరుడ వాహనంపై భక్తులకు దర్శన మిచ్చారు. అనంతరం అదే వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వేంచేపు చేసి, విశేషంగా అలంకరించారు. తెల్లవారుజాము 4.50 గంటలకు ఆలయ ఉత్తర ద్వారాలు తెరిచారు. ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు తొలి దర్శనం చేసుకున్నారు. ఐదు గంటల నుంచి భక్తులకు సర్వ దర్శన భాగ్యాన్ని కల్పించారు. వేలాది భక్తులు, గోవింద స్వాములు స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని వీక్షించి పరవశించారు. ఉదయం ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లు ఉత్తర ద్వారం నుంచి వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవానికి అట్టహాసంగా బయల్దేరి వెళ్లారు. ర్వాత ఉత్తర ద్వారం వద్ద వెండి శేష వాహనంపై కొలువైన స్వామి, అమ్మవార్లు రాత్రి 9 గంటల వరకు భక్తులకు దర్శన మిచ్చారు. గోవింద దీక్షాధారులు తెల్లవారుజామున ఆలయ ప్రధాన రాజగోపుర మెట్ల మార్గంలో కర్పూరంతో స్వామివారి శంఖు, చక్ర, నామాలను ఏర్పాటు చేసి, వాటిని వెలిగించారు. అనంతరం ఇరుముడులతో స్వామివారి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆ తరువాత దీక్ష విరమించారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుతో సహా వివిధ రంగాలకు చెందిన పలువురు శ్రీవారి ఉత్తర ద్వార దర్శన వేడుకలో పాల్గొన్నారు.

నల్లజర్ల: అనంతపల్లిలోని రుక్మిణీ, సత్యభామ సమేత మదనగోపాల స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.అనంతరం గరుడ వాహనంపై స్వామివారికి భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు.ఉత్సవ కమిటీ చైర్మన్ కానుబోయిన గంగాధరరావు, అర్చకుడు దివి పాండురంగ శర్మ, భక్తులు పాల్గొన్నారు. నల్లజర్లకు చెందిన సుధీర్ దంపతులు గరుత్మంతునికి ఇత్తడి తొడుగు, కొరటాని తొటియ్య ఇత్తడి పాదుకలు సమర్పించారు. బండి రేవు సమీపంలోని వినాయక ఆలయంలో ఏకాహం నిర్వహించారు. ఆవపాడు భక్తాంజనేయ స్వామి ఆలయ16వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సుదర్శన హోమం నిర్వహించారు.16 మంది దంపతులు పూజాదికాలు చేశారు. బాల భక్త సమాజం ఆధ్వర్యంలో ఏకాహం జరిగింది. ఉదయం10 గంటల నుంచి రాత్రి వరకూ అన్నదాం చేశారు.

కొవ్వూరు: వేకువజాము నుంచీ పట్టణంలోని వరద గోపాలస్వామిని ఉత్తర ద్వారం గుండా భక్తులు దర్శించుకున్నారు. అనంతరం గీతా పారాయణ చేశారు. సాయంత్రం ఆలయ వద్ద భజ గోవిందం కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు గోవర్ధనం అనంతగోపాల్, గోవర్ధనం శ్రీనివాసరావు పూజలు చేశారు. బసివిరెడ్డిపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోను, గోష్పాద క్షేత్రంలోని సుందర గోవిందుడి, శ్రీనివాసపురంలోని వేంకటేశ్వరస్వామి, వేగివాడి చావిడి సమీపంలోని స్వామి వారి ఆలయాల్లోను భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. సంస్కృత పాఠశాలలోని గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. గోవింద ఆకారంలో దీపాలు వెలిగించారు. ఉత్తర ద్వారంలో విష్ణుమూర్తి విగ్రహం ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం ఏర్పాట్లు చేశారు.

నిడదవోలు: పట్టణ నడిబొడ్డున గల రుక్మిణి, సత్యభామ సమేత మదన గోపాలస్వామి వారిని భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అర్చకులు వేకువజాము మూడు గంటల నుంచి స్వామివారికి పంచామృత అభిషేకాలు చేశారు. పట్టణ నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి స్వామివారికి తులసి, అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. అర్చకులు గోవర్ధన దుర్గాప్రసాదాచార్యులు, ఈవో నామా సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

పెరవలి: ధనుర్మాసం, వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం సుమారు ఐదు వేల మంది భక్తులు తరలి రావడంతో ఆలయ నిర్వాహకులు కొద్దిగా ఇబ్బందులు పడ్డారు. భక్తులు స్వామివారి దర్శనం కోసం రెండు గంటలకు పైగా క్యూలైన్‌లో వేచి ఉన్నారు. దూర ప్రాంత భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ భోజనాలు ఏర్పాటు చేశారు. భక్తులు స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

ఉండ్రాజవరం: వడ్లూరు గ్రామంలో కొలువైన సీతారామస్వామి వారిని నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస నాయుడు, సుమలత దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ , ఎంపీటీసీ సభ్యుడు వేండ్ర శ్రీను పాల్గొన్నారు. ఉండ్రాజవరంలోని కేశవస్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, చామంతులతో సహస్ర నామ పూజ నిర్వహించారు. స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలకరించారు. వేలివెన్ను చినదేవుని, వేణు గోపాలస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా వైభవంగా నిర్వహించారు. వెలగదుద్రు వేంకటేశ్వరస్వామి, ఉండ్రాజవరం సీతారామస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారం గుండా భక్తులు దర్శనం చేసుకున్నారు. తాడిపర్రు మదన గోపాలస్వామి ఆలయంలో మహిళలు గీతా పారాయణ చేశారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో కొలువైన పద్మావతీ అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు పెరవలి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. తాళ్లపూడి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోవర్ధనం చక్రవర్తి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

80 కిలోల వెన్నతో స్వామి వారికి అలంకరణ

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారిని 80 కిలోల వెన్నతో అలంకరించారు. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు చివుకుల సుధీర్‌స్వామి ఆధ్వర్యంలో ఉదయం 4 గంటలకు పూజలు చేశారు. మధ్యాహ్నం వరకూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శనం చేసుకున్నారు. చాగల్లు, గోపాలపురం, నల్లజర్ల, కొవ్వూరు మండలాల నుంచి మహిళలు కాలినడకన శ్రీవారి ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రి ఏడు గంటలకు శ్రీవారిని గరుడ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో బాబాను వేంకటేశ్వరస్వామిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గౌరీపట్నం సమీపంలోని పర్వతంపై కొలువైన వేంకటేశ్వరస్వామి వారిని భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు.

చాగల్లు: స్థానిక మెయిన్ రోడ్డులోని అలివేలు మంగా పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. శెట్టిబలిజ సీతారామస్వామి ఆలయంలో సప్తాహం నిర్వహించారు. పాటమ్మపేటలోని వేణు గోపాలస్వామి ఆలయంలోను, బ్రాహ్మణగూడెం రామాలయంలోను, ఊనగట్ల, కలవలపల్లి, మార్కొండపాడు గ్రామాల ఆలయాల్లోను ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిడదవోలు రూరల్: మండలంలోని మునిపల్లిలో కొలువైన లక్ష్మీ నారాయణ స్వామివారికి చామంతులతో ప్రత్యేక పూజలు చేశారు. వైకుంఠ ద్వారా లక్ష్మీ నారాయణస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. అర్చకులు రామకృష్ణామాచార్యులు, ఈఓ సోమాల శివ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ద్వారకాతిరుమలలో ఉత్తర ద్వారం వద్ద శ్రీవారిని దర్శిస్తున్న భక్తులు


ఉండ్రాజవరం మండలం వడ్లూరు సీతారామస్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు దంపతులు


అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి వారు


అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి క్యూలో వస్తున్న భక్తులు


80 కిలోల వెన్నతో దేవరపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి అలంకరణ

క్లుప్తంగా

పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలు


వడ్లూరులో లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస నాయుడు

ఉండ్రాజవరం: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పథకాలను అమలు చేస్తున్నారని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు అన్నారు. పెంచిన వైఎస్సార్ పెన్షన్ సొమ్మును సోమవారం ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు, సుమలత దంపతులు మండలంలోని వడ్లూరు గ్రామంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు పింఛను సొమ్మును రూ.2750కు పెంచి నూతన సంవత్సర వేళ పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. మండలంలో కొత్తగా 310 మందికి పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు.వడ్లూరు ఉన్నత పాఠశాల్లో రూ.1.20 కోట్ల వ్యయంతో జరుగుతున్న నాడు–నేడు రెండో దశ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ , ఎంపీటీసీ సభ్యులు వేండ్ర రమేష్, పాఠశాల హెచ్ఎం సత్యవాణి పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

తాళ్లపూడి: ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) 2023 క్యాలెండర్‌ను ఎంఈవో కె. వివేకానంద సోమవారం తాళ్లపూడిలో ఆవిష్కరించారు. ఈ క్యాక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఎం.రవి, నాయకులు బి. విజయబాబు, సీహెచ్ శ్రీనివాస్, రాజకుమారి, సోమేశ్వరరావు, అబ్బులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకాలు


పెరవలి మండలం ముక్కామలలో సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం

పెరవలి: నెలవారీ పింఛను మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెంచడంతో సామాజిక పింఛనుదారుల్లో ఆనందం పెల్లుబుకుతోంది. ఈ క్రమంలో వారు మండలంలోని నడుపల్లి గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, ముక్కామల గ్రామంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధుల ఆకలి తీర్చటానికే దేవుడలా వచ్చాడని ఆయన రుణం తీర్చుకోలేనిదన్నారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యుడు గండేపల్లి రామకృష్ణ, సర్పంచ్ కేతా త్రిమూర్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వేండ్ర ఏసు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో నేత్ర వైద్య శిబిరం


నేత్ర వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: స్థానిక క్రీస్తు సంఘం చర్చిలో పాస్టర్ జాన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సోమవారం ప్రారంభించారు. అనంతరం రోగులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వాకికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కడిమి రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మాధవరపు వెంకటేశ్వరరావు, సిద్ధా సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కాలువ గట్లపై చెట్ల నరికివేత


కొవ్వాడ కాలువ గట్టుపై చెట్లను నరికివేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

గోపాలపురం: మండలంలోని రాజంపాలెం పంచాయతీ పరిధిలోని కొవ్వాడ జలాశయం కాలువ గట్టుకు ఇరువైపులా గల రూ.రెండు లక్షల విలువైన చెట్లను అక్రమార్కులు నరికివేశారు. ఆ ప్రాంతాన్ని ఇరిగేషన్ అధికారులు సోమవారం పరిశీలించారు. రెండు రోజులు రాత్రివేళ కాలువ గట్టుకు ఇరువైపులా ఉన్న 30 ఏళ్ల వయసున్న నేరేడు, వేప చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి అక్కడి నుంచి తరలించుకు పోయినట్టు అధికారులు గుర్తించారు. కాలువ గట్టను, చెట్లను కాపాడాల్సిన బాధ్యత ఆయకట్టు రైతులపై ఉందని, కనీసం రైతులు పట్టించుకోకపోవడం వల్లే ఇలా జరిగిందని ఇరిగేషన్ ఏఈ సీహెచ్ భాస్కరరావు వ్యాఖ్యానించారు. చెట్లను నరికివేసిన వారిపైన, సమీప రైతులపైన కేసులు పెడతామని ఏఈ చెప్పారు.

క్రీడలపై యువకులు ఆసక్తి చూపాలి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

గోపాలపురం: క్రీడలపై యువత ఆసక్తి చూపాలని, వాటి ద్వారా ఉద్యోగావకాశాలను కూడా అందిపుచ్చుకోవచ్చని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని వేళ్లచింతలగూడెంలో రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు.రంగారావు, మధుబాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్ ఆండ్ ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగేళ్లుగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి క్రికెట్, కబడ్డీ పోటీలతో పాటు మహిళలకు ముగ్గులు పోటీలు కూడా నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు.


బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, రాష్ట్ర క్రీడల డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, ఆర్‌అండ్ ఎం ఫౌండేషన్ చైర్మన్ ఘంటా మధుబాబు, పిన్నమనేని చినబాబు, కొర్లపాటి రాము, తహసీల్దార్ బి. రవీంద్రనాథ్, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి, మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, ఆహారం పంపిణీ


పేదలకు పంపిణీ చేసే దుస్తులు, ఆహారంతో కాల్దారి వైఎంసీఏ సభ్యులు


నల్లజర్లలో పేదలకు దుప్పట్లు, నిత్యావసరాలు అందజేస్తున్న వసంతాడ ఆనంద్ స్వరూప్

ఉండ్రాజవరం: తోటి వారికి సహాయపడడంలో మండలంలోని కాల్దారి వైఎంసీఏ యూత్ సభ్యులు ఆదర్శంగా నిలిచారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం వారు మండలంలోని 250 మంది నిరు పేదలకు దుప్పట్లు, ఆహారం , పండ్లు పంపిణీ చేశారు. ఆ గ్రామ యువత ఆర్థిక సహకారంతో అక్కడి జీడీఎం ప్రార్థన మందిరంలో వారీ సేవా కార్యక్రమం నిర్వహించారు.

నల్లజర్లలో..

నల్లజర్ల: తాడేపల్లిగూడెంకు చెందిన పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్, డైమండ్స్ లయన్స్ క్లబ్ ఫౌండర్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు పుట్టినరోజును సోమవారం నల్లజర్లలో నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వెనుక గల పేద కుటుంబాలకు సామాజికవేత్త, అసిస్టెంట్ ప్రొఫెసర్ వసంతాడ ఆనంద్ స్వరూప్ బియ్యం, దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు.పేరిచర్ల ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఆనంద్ స్వరూప్ కొనియాడా. అందుగుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

5న దేవరపల్లికి చాగంటి రాక

దేవరపల్లి: ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకుడు చాగంటి కోటేశ్వరరావు ఈ నెల 5న దేవరపల్లి వస్తున్నారు. స్థానిక ఆది శంకరాచార్య జ్ఞాన మందిరాన్ని, శ్రీవారి ఆలయాన్ని ఆయన సందర్శిస్తారు. జ్ఞాన మందిరం వద్ద సాయంత్రం ఐదు నుంచి ఎనిమిది గంటల వరకూ గురువైభవం, శంకర విజయం అనే అంశాలపై చాగంటి ప్రవచనాలు ఇస్తారని మందిరం కమిటీ అధ్యక్షుడు చలంగర్ల హరిబాబు, కార్యదర్శి నారాయణ విశ్వేశ్వరరావు, నిర్వాహకుడు టి.సత్యనారాయణ తెలిపారు.

గతేడాది 349 సారా కేసుల నమోదు

కొవ్వూరు: స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (ఎస్ఈబీ) కొవ్వూరు స్టేషన్ పరిధిలో గతేడాది కాలంలో సారా తయారీ, విక్రయదారులపై 349 కేసులు నమోదు చేశామని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఈ కేసుల్లో 413 మందిని అరెస్టు చేసి, 3,494 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. 83,650 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. 21 వాహనాలను స్వాధీనం చేసుకుని, 372 మందిని అధికారుల ఎదుట బైండోవర్ చేశామని చెప్పారు. బైండోవర్ చేసినప్పటికీ మళ్లీ అవే నేరాలకు పాల్పడిన ఆరుగురి నుంచి బీచ్ ఆఫ్ బాండ్ల కింద రూ.65 వేలు అపరాధ రుసుంగా వసూలు చేశామన్నారు. ఈ ఏడాది కాలంలో వివిధ కేసుల్లో పట్టుబడిన 13 వాహనాలకు వేలం నిర్వహించగా రూ.87,600 సమకూరాయన్నారు. తరచూ సారా కేసుల్లో పట్టుబడిన ఇద్దరిపై పీడీ యాక్టు ఓపెన్ చేశామన్నారు.

రేపు అల్లూరి బాపినీడు హెల్త్ క్లినిక్ ప్రారంభం

నెలాఖరు వరకూ ఉచిత వైద్య సేవలు

కొవ్వూరు: అవంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బాపూజీనగర్‌లో అల్లూరి బాపినీడు పేరుతో హెల్త్ క్లినిక్‌ను బుధవారం ప్రారంభించనున్నట్టు ఆ సంస్థ చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ తెలిపారు. బుధవారం నుంచి ఈ నెలాఖరు వరకూ కొవ్వూరు పరిసర ప్రాంత వాసులకు అనుభవజ్ఞులైన వైద్యులతో వైద్య సేవలు అందించనున్నట్టు సోమవారం తెలిపారు. అత్యాధునిక పరికరాలతో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. రక్తం, మూత్రం, గుండె, మూత్రపిండాలు, కాలేయం, మధుమేహం, థైరాయిడ్, ఎముకల వ్యాధులకు వైద్యుల సిఫార్సుల మేరకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ఈనెల 4వ తేదీ ఉదయం 8.30 గంటలకు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా ఈ హెల్త్ క్లినిక్ ప్రారంభించనున్నట్టు ఇంద్రకుమార్ తెలిపారు.


అల్లూరి ఇంద్రకుమార్, అవంతీ ఫౌండేషన్ చైర్మన్

ఆర్టీసీ బస్సు, ఆయిల్ ట్యాంకర్ ఢీ

గోపాలపురం: స్థానిక వైఎస్సార్ బైపాస్ వద్ద సోమవారం టీఎస్ ఆర్టీసీ బస్సు, ఆయిల్ ట్యాంకర్ ఢీ కొన్నాయి.వివరాలిలా ఉన్నాయి. కొయ్యలగూడెం నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న ఆయిల్ ట్యాంకర్, గోపాలపురం నుంచి భద్రాచలం వెళుతున్న టీఎస్ ఆర్టీసీ బస్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో ఒక్కసారిగా ఆయిల్ ట్యాంకర్ నుంచీ పెద్ద శబ్దం వచ్చింది. దాంతో ఏం జరిగిందో తెలియక ఆర్టీసీ బస్సులో ఉన్న 52 మంది ప్రయాణికులు ఆందోళన చెందారు. ఆయిల్ ట్యాంకర్ ఖాళీది కావడంతో ప్రయాణికులకు ప్రమాదం జరగలేదు.ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు గోపాలపురం ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

క్రీస్తు మార్గమే శాంతి సందేశం

నిడదవోలు రూరల్: క్రీస్తు మార్గమే శాంతి సందేశమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. డి.ముప్పవరంలోని బేతేలు, పెంతెకోస్తు చర్చిలో ఆదివారం రాత్రి జరిగిన క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘ కాపరి బిషప్ రెవరెండ్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రిస్మస్ కేక్‌ను ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు కట్ చేశారు. పాస్టర్ బిషప్ ఫిలిఫ్ వాక్యోపదేశం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు సంగిసీడి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాల ప్రభు, నాగిరెడ్డి సత్తిపండు, అజయ్‌కుమార్, ముప్పిడి విజయ్, స్థానికులు పాల్గొన్నారు.

రేపు కొవ్వూరులో వాహనాల వేలం

కొవ్వూరు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో(ఎస్ఈబీ) స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 45 ద్విచక్ర వాహనాలకు బుధవారం వేలం నిర్వహించనున్నట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలో తమ స్టేషన్ వద్ద వాహనాలకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్‌తో ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులు

ఉండ్రాజవరం: విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి విజయాలు సాధించాలని ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.విశ్వప్రసాద్ అన్నారు. ఆ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు యివ్వల రాంబాబు ఆర్థిక సహకారంతో ఆ హైస్కూల్లోని 200 మంది 10వ తరగతి విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ రాంబాబు ఏటా 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేయడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కర్రెళ్ల సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు నిరీక్షణ రాజు, పద్మావతి, బి.శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విధులకుమారి సామాజిక సేవలు మరువలేనివి

నిడదవోలు: స్వాతంత్ర్య సమరయోధుడు చర్ల గణపతి శాస్త్రి కుమార్తె, సర్వోదయ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షురాలు, చర్ల సుశీల వృద్ధాశ్రమ నిర్వాహకురాలు చర్ల విధులకుమారి చేపట్టిన సామాజిక సేవలు మరువలేనివని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. చర్ల సుశీల వృద్ధాశ్రమాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అనారోగ్యంతో మృతి చెందిన చర్ల విధులకుమారి సోదరి మృదుకుమారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ సర్వోదయ భావాలతో 40 ఏళ్లుగా వృద్ధులు, దివ్యాంగులు, అనాథలకు ఆశ్రయం కల్పించి మానవతా సేవలు చేసిన విధులకుమారి మృతి తీరని లోటన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వార్డు కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ తదితరులు ఉన్నారు.